క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు లింగారెడ్డిపాలెం విద్యార్థులు



కోడూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27న గుడివాడలో జరిగిన ఖోఖో పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో పి.మధుప్రియ, బి.దివ్య, పి.లావణ్య, అండర్-17 బాలికల విభాగంలో బి.మహేశ్వరి, పి.పార్వతి ప్రతిభ కనబరిచారు. 28న మచిలీపట్నంలో జరిగిన బాల్‌బాడ్మింటన్ పోటీల్లో, 30న గుడివాడలో జరిగిన కబడ్డీ పోటీల్లో పేరే మధుప్రియ జిల్లా జట్టు తరఫున ఆడి సత్తా చాటింది. వీరందరూ రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం నాగరత్న కుమారి తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ బీపీఎల్ ప్రసాద్, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరకుమారికి సన్మానం



కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెం జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం జెట్టి వీరకుమారి సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయ బృందం వీరకుమారి-పెరుమాళ్లు దంపతులను సన్మానించారు. ఎంఈఓ 1 విద్యాసాగర్, ఎంఈఓ 2 రాజ్‌కుమార్ మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో వీరకుమారి అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వీరకుమారి-పెరుమాళ్లు దంపతులు స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు, పెన్నులు, స్కేల్స్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోసూరు అనూష, హెచ్‌ఎం కొండవీటి అశోక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. కనకారావు, రిటైర్డ్ ఎంఈఓ రాంబ్రహ్మం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ యక్కటి గిరిధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన



మచిలీపట్నంటౌన్: క్రాఫ్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్ నగర ప్రజలను ఆకట్టుకుంటోంది. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న లేడీస్ క్లబ్ ఆవరణలో ఈ నెల 15న క్రాఫ్ట్ బజారును ప్రారంభించారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు చేనేత, హస్తకళాకారులు తయారుచేసిన వస్తువులతో పాటు పలు రకాల వస్తువులను ప్రదర్శిస్తూ విక్రయిస్తున్నారు. 40 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేనేత, కాటన్ వస్త్రాలు, చెక్కతో తయారు చేసిన పలు వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పురుషుల కాటన్ చొక్కాలతో పాటు మహిళలకు చీరలు, టాప్‌లు విక్రయిస్తున్నారు. మహిళల ఉపయోగించే ఆభరణాలు ఇక్కడ లభిస్తున్నాయి. వరంగల్ టవల్స్, రాజస్థాన్ గాజులు, ఇమిటేషన్ జ్యూయలరీ, సారంగపూర్ ఉడ్ ఐటమ్స్, బాగల్‌పూరి శారీస్, బెంగాలీ కాటన్ శారీలు ఇలా అనేక రకాల వస్తువులు లభిస్తున్నాయి.

ఉద్యాన రైతులకు సబ్సిడీపై ప్లాస్టిక్ ట్రేలు



కోసూరువారిపాలెం(మోపిదేవి): ఉద్యాన పంటలు సాగు చేసే ముఖ్యంగా కూరగాయ తోటలు వేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ప్లాస్టిక్ ట్రేలు అందిస్తోందని ఉద్యాన అధికారి ఎస్. రమేష్ అన్నారు. కోసూరువారిపాలెం రైతు భరోసా కేంద్రం వద్ద శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టమోటా సాగు చేసే రైతులు ఒక హెక్టారుకు రూ. 20 వేలు సబ్సిడీపై ప్లాస్టిక్ ట్రేలు పొందవచ్చునన్నారు. ఎఫ్‌ఐజీ గ్రూపు కింద కూడా నమోదు చేసుకోవచ్చునని రైతులకు సూచించారు. నీటి సదుపాయం ఉన్న రైతులు ఆయిల్‌పామ్, కొబ్బరి సాగు ద్వారా ఈ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. బొప్పాయి, టమోటా పంట సాగుచేసిన రైతులు వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, బిల్లులు రైతు భరోసా కేంద్రంలో గ్రామ ఉద్యాన సహాయకులకు అందజేయాలని సూచించారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు, ఉద్యాన సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు ఎనలేనివి





అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు : పెడనలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రెడ్డయ్య తదితరులు

- ఘనంగా జయంతి కార్యక్రమాలు
- చిత్రపటాల వద్ద నివాళి



బందరు నర్సింగ్ కళాశాలలో ఐక్యత దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు



జాతీయ ఐక్యత ర్యాలీలో పాల్గొన్న బందరు పోస్టల్ ఉద్యోగులు

పెడన: భారతదేశ ఉక్కు మనిషి, దేశ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు పెడన ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ దేశానికి పటేల్ చేసిన సేవలను కొనియాడారు. ప్రముఖ స్వాతంత్ర్య యోధుడిగానే కాకుండా స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి కృషి చేశారని చెప్పారు. హైదరాబాద్, జునాగఢ్ తదితర సంస్థానాలు భారతదేశంలో విలీనం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్వాతంత్ర్యానంతరం జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర మంత్రి మండలిలో హోంశాఖ మంత్రిగా, భారత ఉప ప్రధాన మంత్రిగా సేవలందించారని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జయరామ్, వైఎస్సార్ సీపీ పెడన మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లోయ ఆంజనేయులు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బాలాజీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● **కోడూరు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, ఏఓ పాండురంగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సింహాద్రి నివాళి..

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ హోంమంత్రిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ అందించిన సేవలు నిరుపమానమన్నారు. సంస్థానాలను ప్రభుత్వంలో విలీనం వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

మచిలీపట్నంటౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినులు పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు విచిత్రవేషాలతో అలరించారు. జిల్లా సర్వజన ఆస్పత్రి నుంచి నర్సింగ్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శ్రీనివాస్, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశాలత, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజారమణి, ఎస్‌ఎస్‌ఎస్ పీఓ వరలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ నయోని, జిల్లా ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు ఉల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ర్యాలీ..

నగరంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయ ఉద్యోగులు రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారిలోని హెడ్ పోస్టాఫీస్ నుంచి కోనేరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు.

కాంగ్రెస్ కార్యాలయంలో..

నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమం, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు అబ్దుల్‌మతీన్, కొడమంచిలి చంద్రశేఖర్, ముప్పిడి కోటేశ్వరరావు, ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

● **గూడూరు:** గూడూరు మండలంలో దేశ సమైక్యతా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలు చేబూని గ్రామంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ పేరిశెట్టి తేజోవతి, పాఠశాల హెచ్‌ఎం ఎం.జ్యోతి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలిరావాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: సామాజిక సాధికార బస్సు యాత్ర దివిసీమ అవనిగడ్డకు నవంబర్ 2వ తేదీన రానుందని, జగన్‌పై ప్రేమతో ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పిలుపు నిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) అధ్యక్షతన మంగళవారం మోపిదేవిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సామాజిక వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, జగనన్న ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించేందుకు ఈ యాత్ర చేపట్టామన్నారు. దివిసీమలో 22ఏ చుక్కల భూమి పరిష్కారం, ఎదురుమొండి వద్ద బ్రిడ్జి, ఘంటసాల మండలంలో ఎత్తిపోతల పథకం, కరోనా సమయంలో ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వైద్య సేవలు వంటివి ఎన్నో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు నిర్వహించామని వివరించారు. డెల్టా ప్రాంతంలో రైతులను ప్రభుత్వ ఆదుకుంటోందని చెప్పారు.

బస్సు యాత్ర హెడ్యూల్ ఇలా..

నవంబర్ 2 తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు సామాజిక సాధికార బస్సు యాత్ర అవనిగడ్డ పార్టీ కార్యాలయానికి చేరుకుంటుందని చెప్పారు. అక్కడి నుంచి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం ర్యాలీగా సభా ప్రాంగణానికి యాత్ర చేరుకుంటుందని తెలిపారు. రాష్ట్ర మంత్రులు విడదల రజని, జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున, నందిగం సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్ తదితరులు పాల్గొంటారని వివరించారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీటీసీలు కారుమూరి శివనాగులు, సనకా వెంకట రాజేష్‌బాబు, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి..

కోడూరు: నవంబర్ 2న అవనిగడ్డలో జరుగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అన్నారు. మంగళవారం రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి గ్రామాల్లో సామాజిక యాత్రపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేసి సామాజిక సాధికారత వైపు అడుగులు వేశారని నరసింహారావు వివరించారు. ప్రతి ఒక్కరూ యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, మండల మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణ రావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాకు కృషి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: తప్పులు లేని ఓటర్ల జాబితా కోసం మచిలీపట్నం నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్‌లెవల్ ఏజెంట్లు, కార్పొరేటర్లు, డివిజన్ కన్వీనర్లు, సర్పంచులు, నాయకులకు అవగాహన కార్యక్రమం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథి పేర్ని నాని మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 27వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందన్నారు. ఈ ఓటర్ల జాబితాలో ఏమైనా క్లయిమ్‌లు, అభ్యంతరాలు ఉంటే డిసెంబరు 9వ తేదీలోగా తెలియజేయాలని ఎన్నికల కమిషన్ సూచించిందన్నారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను పరిశీలించాలన్నారు. జాబితాలో సవరణలు ఉంటే వాటిని గుర్తించడంలో బూత్‌లెవల్ ఏజెంట్లు కీలకపాత్ర పోషించాలన్నారు. చిరునామాను మార్చుకున్న ఓటర్ల వివరాలు, డోర్ నంబర్, అడ్రస్ వెరిఫికేషన్, ఓటర్ల వివరాలను పరిశీలన చేసి బీఎల్‌ఓలకు సరైన సమాచారం ఇవ్వాలని చెప్పారు. జనవరి 5న ఓటర్ల జాబితా తుది ప్రచురణ జరుగుతుందని, అర్హులై ఉండి ఎవరి పేర్లు జాబితాలో లేకపోయినా, వారి పేర్లు తొలగించినా క్లయిమ్‌లు, అభ్యంతరాలు తెలియజేయవచ్చునన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్లు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపు సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నాగాయలంక: శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం మండల నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా తలగడదీవి గ్రామానికి చెందిన భోగాది సోమశేఖర్ (చిన్నారి)ఎంపికయ్యారు. సంఘ సమావేశం నాగాయలంకలో సంఘం సీనియర్ నేత, ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. గ్రామ కమిటీల అధ్యక్షులుగా ఎన్నికైన వడ్లమూడి రామకృష్ణ (గణపేశ్వరం), పిరాటి శశి (బర్రంకుల) పర్రచివరకు చెందిన బండ్రెడ్డి బాబు, మండలి బాజీ, అనిమిశెట్టి శివశంకర్(ఏటిమొగ), బండ్రెడ్డి వెంకటేశ్వరరావు (మర్రిపాలెం), బీసాబత్తిన వీరప్రసాద్ (పెదపాలెం), తోట విజయ నాగేశ్వరరావు (డేగలవారిపాలెం), బండ్రెడ్డి శివప్రసాద్ (టి.కొత్తపాలెం), అర్జా బుచ్చిబాబు, పేటేరు శ్రీనివాస్ (భావదేవరపల్లి), భీమా బాబూరావు, భోగాది శివవిష్ణువర్ధన్ (నాగాయలంక), పేర్ల శ్రీహరి (పేర్లవానిలంక), రేమాల బాలవెంకటకృష్ణ (రేమాలవారిపాలెం) మండల కమిటీ సభ్యులుగా సేవలందిస్తారని తోట శ్రీనివాసరావు వివరించారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా సర్వజన ఆస్పత్రి వద్ద ఉన్న ఏఐటీయుసీ స్థూపంపై సంఘ జెండాను నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సంఘం మచిలీపట్నం గౌరవాధ్యక్షుడు ఎల్. ఫిలిప్, అధ్యక్షుడు బెల్లంకొండ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఒంటిపులి లక్ష్మణరావు, కార్యదర్శులు కె. అంజన్‌కుమార్, ఎం. నాగేశ్వరమ్మ, కోశాధికారి ఎం. నాగరాజు పాల్గొన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి. ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శ్రీనివాస్ హాజరయ్యారు. అలాగే ఆర్టీసీ కార్గో వర్కర్స్ యూనియన్ స్థూపం వద్ద, గాంధీ బొమ్మ శివాలయం సమీపంలోని సంఘ స్థూపం వద్ద సంఘ జెండాలను ఆవిష్కరించారు.

డాక్టర్ భానుమూర్తి సేవలు అభినందనీయం

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు కంటి వైద్య నిపుణుడు జి. భానుమూర్తి అందిస్తున్న సేవలు మరువరానివని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చీలి రవీంద్ర అన్నారు. ఇటీవల వైద్య రత్న జాతీయ పురస్కారం అందుకున్న డాక్టర్ భానుమూర్తిని మంగళవారం రాత్రి రవీంద్ర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు డాక్టర్ భానుమూర్తి మంచిగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో భానుమూర్తి మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

8న ప్రమాణ స్వీకారోత్సవం

మచిలీపట్నంటౌన్: మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన గాడెల్లి డేవిడ్ శామ్యూల్ మంగళవారం నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మను, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతిని, పలువురు కార్పొరేటర్లను మంగళవారం కలిశారు. నవంబర్ 8వ తేదీన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమామం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని వారిని కోరారు. 8వ తేదీ ఉదయం 9 గంటలకు మార్కెట్ యార్డు ఆవరణలో ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్

కోడూరు: యువత మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మారుతీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత పెడదోవ పట్టకుండా చదువుపై దృష్టి సారించాలని ఎస్‌ఐ సూచించారు. కళాశాలల్లో విద్యార్థులంతా కలిసి ఉండాలని, ర్యాగింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినులు దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆపద సమయంలో అండగా ఉండే దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవడంతో పాటు ఇళ్ల వద్ద కూడా తల్లిదండ్రుల ఫోన్లలో కూడా ఇన్‌స్టాల్ చేయాలని ఎస్‌ఐ సూచించారు. మత్తు పదార్థాలు, మద్యం, సిగరెట్, గంజాయి వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని, వీటికి బానిసలైతే జీవితం వృథా అవుతుందని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు పలు చట్టాలను వివరించారు.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష



మచిలీపట్నం కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మచిలీపట్నంటౌన్: 'సాక్షి' మీడియా గ్రూపు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సాక్షి స్పెల్‌బీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక కేకేఆర్ గౌతమ్, శ్రీ బాలాజీ విద్యాలయంలో స్పెల్‌బీ పరీక్షలు నిర్వహించారు. కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 23 మంది, బాలాజీ విద్యాలయంలో 17 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పరీక్షలంటే భయం పోయేలా నిర్వాహకులు పలు సూచనలు చేశారని చెప్పారు. ఈ సూచనలు తమకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. సింహాచలం నాయుడు, బాలాజీ విద్యాలయం ఉపాధ్యాయినులు అనసూయ, విజయలక్ష్మి పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్దె పూజలు



అవనిగడ్డలో అట్లతద్దె వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



నాగాయలంక వేడుకల్లో పాల్గొన్న వారికి జాకెట్ ముక్క, గాజులు అందజేస్తున్న దృశ్యం

కృత్తివెన్ను: అట్లతద్దె పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునే లేచి స్నానమాచరించి ముత్తదువులతో కలిసి పిండివంటలు, కాయగూరలతో చేసిన వంటకాలతో భోజనాలు చేయడంతో ఈ వ్రతం ప్రారంభమవుతుంది. సాయంత్రం స్నానమాచరించి తోరణాలు కట్టుకుని, వాయినాలు అందుకోవడంతో వ్రతం ముగిస్తుంది. అట్లను వాయినాలుగా చేసి ముత్తయిదువులకు నూతన వధువు అందించి వారి ఆశీర్వాదం తీసుకోవడం పండుగలో ప్రత్యేకం. గ్రామీణ ప్రాంతాల్లో యువతీ, యువకులు ఊయలలూగుతూ సందడి చేశారు. తీర ప్రాంతాల్లో ప్రత్యేకంగా చేసిన రాట ఊయల ఆకర్షణగా నిలిచింది.

● **కోడూరు:** గౌరిదేవికి అత్యంత ప్రీతిపాత్రమైన అట్లతద్దె వేడుకలను కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువజామునే మహిళలు గౌరిదేవికి ప్రత్యేక పూజలు చేసి, ఉపవాస దీక్ష చేపట్టారు. సాయంత్రం కాలువల వద్ద ప్రత్యేక స్నానాల అనంతరం ఇళ్లలో మళ్లీ అమ్మవారికి అట్ల నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్న యువతుల వాయినాల కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో పూర్తి చేశారు. చూడముచ్చటగా అలంకరించిన ఊయలలో మహిళలు, చిన్నారులు ఊగుతూ సందడి చేశారు.

● **అవనిగడ్డ:** సంప్రదాయ పండుగ అట్లతద్దె వేడుకలను స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వేడుకలను ప్రారంభించి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదరణ తగ్గిపోతున్న అట్లతద్దె వంటి సంప్రదాయ పండుగను ఇలా కాలేజీలో నిర్వహించుకోవడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ వేషధారణలో విద్యార్థినులు ఊయల ఊగారు. కార్యక్రమాన్ని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.



అవనిగడ్డలో ఊయల ఊగుతున్న విద్యార్థినులు



ఒర్లగొందితిప్పలో రాట ఊయల ఊగుతున్న యువతులు

సీకే నాయుడుకు ఘన నివాళి



మచిలీపట్నంటౌన్: ప్రముఖ క్రికెటర్ సీకే నాయుడు వర్ధంతి కార్యక్రమం నగరంలోని సర్కారుతోటలో మంగళవారం నిర్వహించారు. సీకే నాయుడు విగ్రహానికి రిటైర్డ్ అధ్యాపకుడు ఎస్. వెంకటేశ్వరరావు, జర్నలిస్ట్ నాయకుడు బడే ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీడారంగానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. 1955లో భారత ప్రభుత్వం సీకే నాయుడుకు పద్మ విభూషణ్ పురస్కారంపై గౌరవించిందన్నారు. సీకే నాయుడు మచిలీపట్నానికి చెందిన వాడు కావడం గర్వకారణమన్నారు.